# పునర్జన్మ



రమాదేవి బుక్కపట్నం

"మాతృత్వంలోనే ఉంది స్త్రీ జన్మ సార్థకం, ఆ దేవుడు ఇచ్చిన అందమైన వరం" ఈ వాక్యాలు ఎంత బాగుంటాయి. తను ఎక్కడో చదివినాను అనుకుంది సావిత్రమ్మ. నిజమే, భార్గవ్ పుట్టినప్పుడు తను ఎంతగా సంతోషించింది .బుల్లి బుల్లి కాళ్ళు చేతులు, తెల్లటి అందమైన ముఖముతో ఆడుకుంటూ తనను ఎంతగా మురిపించాడని .ఇలా ఆలోచిస్తూ ఈ లోకంలోకి వచ్చింది సావిత్రమ్మ .కానీ ఇప్పుడు తన ప్రియాతి ప్రియమైన కొడుకు భార్గవ్ కి పెద్ద కష్టం వచ్చింది.

ఇప్పుడేం చేయాలి? ఏమి చేయాలి? ఎలా వాడిని బ్రతికించు కోవాలి?ఏదో ఒకటి చేయాలి .తన ప్రాణం అడ్డుపెట్టి అయినా వాడి ప్రాణం కాపాడుకోవాలి. ఆనాడు పురాణాల్లో సావిత్రి యమధర్మరాజు తో పోట్లాడి తన భర్త ప్రాణం కాపాడుతుంది. ఈనాడు ఈ సావిత్రి తన కొడుకు కు వచ్చిన అనారోగ్యంతో పోరాడి వాడిని కాపాడుకుంటుంది అని దృఢంగా నిశ్చయించుకుంది.



భార్గవ్ సావిత్రమ్మ కు ఒక్కగానొక్క కొడుకు. రోడ్డు ప్రమాదంలో తన భర్త చనిపోయినా కూడా పిల్లవాడికి తనే తల్లిగా తండ్రిగా మారి ధైర్యం తోడుగా చేసుకొని పెంచుకుంది .యాక్సిడెంట్ అయిన తన భర్తకు సరి అయిన వైద్యం అందక చనిపోయాడని, తనలాంటి పరిస్థితి మరి ఎవరికీ రాకూడదని భార్గవ్ ని డాక్టర్ కోర్సు చదివించింది. తన పేరున ఉన్న భూములను అమ్మి ఒక పెద్ద హాస్పిటల్ కట్టించింది. గైనకాలజిస్ట్ అయిన సంగీత ను తన కోడలుగా తెచ్చుకుంది. కొడుకు కోడలు ఇద్దరూ డాక్టర్లుగా ఉంటూ రోగులకు సేవ చేస్తూ, నామమాత్రపు ఫీజు తీసుకుంటూ వైద్యం చేస్తున్నారు. మంచి హస్తవాసి ఉందని పేరు తెచ్చుకున్నారు. ముద్దుల మూట కట్టే ఇద్దరు పిల్లలతో హాయిగా ఉన్నారు.

దేవుడి దయవల్ల అంతా బాగుంది అనుకునే టైములో పిడుగు లాంటి వార్త. భార్గవ్ కి కిడ్నీ ఫెయిల్యూర్ అయింది. గత కొన్ని రోజుల నుండి రవి ఆరోగ్యం లో వస్తున్న మార్పులు చూసి పరీక్ష చేయిస్తే ఈ విషయం బయటపడింది .తనే ఒక పెద్ద డాక్టర్ అయి ఉండి కూడా ఇలా జరిగేసరికి డీలా పడిపోయాడు భార్గవ్.

"పసితనంలో దేన్నయినా పట్టుకుని నిలబడాలి పెద్దయ్యాక దేన్నైనా తట్టుకొని నిలబడాలి" అంటూ ఎంతో ధైర్యం చెప్పింది సావిత్రమ్మ.

ఇప్పుడు కిడ్నీ మార్పించకపోతే ప్రాణానికి ప్రమాదం అని డాక్టర్ గారు చెప్పాక ఏమి చేయాలో

తోచకుండా ఉంది. భార్గవ్ కి నలభై ఏళ్లు కూడా నిండకముందే ఇలా ఎందుకు జరిగిందో అని కనిపించని ఆ దేవుడిని ఎన్నోసార్లు ప్రశ్నించింది .అయినా మన చేతుల్లో ఏముంది? కష్టం వచ్చినప్పుడే కదా ధైర్యంగా ఉండాల్సింది .ఇప్పుడు టెన్షన్ పడే కన్నా ముందు ఈ సమస్య నుండి ఎలా బయటపడాలి అని ఆలోచించాలి .ఇప్పుడు ఏ మాత్రం ధైర్యం కోల్పోకూడదు . అని బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది సావిత్రమ్మ .

అవును, వాడికి అవసరమైన ఆ కిడ్నీ తనే ఇవ్వాలి. దేవుడి దయ వలన తనది భార్గవ్ ది ఒకే బ్లడ్ గ్రూప్ కావడం వలన తన కిడ్నీ వాడికి సరిపోవచ్చు. డాక్టర్ గారిని కలిసి ఈ విషయం గురించి మాట్లాడి ఆపరేషన్ చేయించాలి అనుకుంది సావిత్రమ్మ.

***

"అమ్మా, నీకు శతకోటి దండాలమ్మా. నీ ఆయువు పోసి నన్ను బ్రతికించి నావు. లేకపోతే నేను ఏమైపోయే వాడినో కదా" అంటూ భార్గవ్ తల్లిని చుట్టుకుని ఏడ్చేశాడు.

"నాన్నా భార్గవ్, నువ్వు అలా బాధ పడకు. నవమాసాలు మోసి కన్నాను .నీవు తప్ప నాకు వేరే లోకం లేదు. నీవు బాగుంటే నేను బాగుంటానురా. నీవు ఒక పెద్ద డాక్టర్ వి. నీ వైద్యం వల్ల ఎంతోమంది ఆరోగ్యవంతులుగా మారి ఆయువు పోసుకుంటున్నారు. నీ ప్రాణము, నీ జ్ఞానము, నీ సేవ, నీ వైద్యము ఎంతోమందికి చాలా అవసరము. నువ్వు ఆరోగ్యంగా ఉంటే నీవల్ల ఎంతోమంది బాగుపడతారు. అదీ కాక నీమీద మా నలుగురి బ్రతుకులు ఆధారపడి ఉన్నాయి .నలుగురు ఎవరూ అనుకుంటున్నావా? నీ భార్య పిల్లలు, నేను కూడా. అంతేకాదు పేదరికంతో సరైన వైద్యం చేయించుకోలేని ఎంతోమంది ఎన్నో రోగాలతో బాధపడే వారు కూడా ఉన్నారు. నాదేముంది రా నాన్నా, వయసు అయిపోయిన దానను .జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న దానను. ఇక నా ఆరోగ్యం అంటావా, నువ్వు ఉండగా నాకేమీ భయం లేదు.

భార్గవ్, దేవుడికి ఒక విషయంలో చాలా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నా కన్న బిడ్డను బ్రతికించు కునే అవకాశం కల్పించినందుకు. ఇలా ఎంతమందికి దొరుకుతుంది చెప్పు. నువ్వు బాధపడకు. మళ్లీ వారం రోజుల్లో నువ్వు మామూలుగా హాస్పిటల్ కి వెళ్లి నీ పనులు హాయిగా చేసుకోవచ్చు .ఈ శుభ సందర్భంలో నాది ఒక కోరిక, తీరుస్తావా?"

"అమ్మా, అలా అనకు. ఆజ్ఞాపించు. నేను ఎప్పుడైనా నీ మాట కాదన్నానా?" అన్నాడు భార్గవ్ తల్లి చేతులు పట్టుకొని.

"నీ దగ్గరకు వచ్చిన పేషెంట్లను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా నీ గుండెల నిండా ప్రేమతో చక్కని వైద్యాన్ని అందించు. వారి మనసుల్లో నీ పట్ల కృతజ్ఞతతో సంతోషం నింపుకొని వెళ్లాలి. సరేనా?" అంది సావిత్రమ్మ.

"తప్పకుండా అమ్మా,, నీవు ఇచ్చిన ఈ పునర్జన్మను సార్థకం చేసుకుంటాను "అంటూ తల్లి గుండెలో ఒదిగి పోయాడు చిన్న పిల్లాడిలా.

"చాలు నాన్నా నాకు ఈ జన్మకు" అంటూ సావిత్రమ్మ సంతోషంగా కొడుకు తల నిమురుతూ ఉండిపోయింది.

"ఆ దినకరుడు ఇచ్చేటి వెలుగునూ ఆ రేరాజు ఇచ్చేటి వెన్నెలనూ మన బ్రతుకులో కురిపించేది అమ్మే కదా" అంటూ రమాదేవి రాసిన పాట రేడియోలో ప్లే అవుతుంది.

***